# ఆంధ్రప్రదేశ్ ఎచ్ఛీట్స్ మరియు బొనా వేకెంసియా చట్టం 1974

## (క్లైము చేయని మరియు వారసులు లేని ఆస్థి)

న్యాయ పరమైన వారసులు లేని, లేదా క్లైముచేయని స్థిర చరాస్తులు పై చట్ట ప్రకారము ప్రభుత్వమునకు దఖలు పడతాయి.

కావున, వారసులెవరూ లేకుండా ఎవరైనా వ్యక్తి చనిపోతే అతని యొక్క వ్యక్తిగత స్థిర చరాస్తులు (క్లైముదారులు లేనప్పుడు) చనిపోయిన వ్యక్తి వివరములు, అతని యొక్క స్థిర చరాస్తుల వివరములు, ప్రస్తుతము ఎవరి ఆధీనములో ఉన్నవి తెలియ జేస్తూ గ్రామ రెవెన్యూ అధికారి, తహశీల్దారు వార్కి నివేదిక పంపాలి.

ఈ చట్టములోని సెక్షన్ 14 ప్రకాము, ఏదైనా బహిరంగ ప్రదేశంలో వస్తువు దొరికితే దాని యజమాని ఎవరో తెలియనప్పుడు, ఎవరికి దొరికిందో ఆవ్యక్తి ఆ వస్తువును పొందడానికి అర్హుడౌతాడు. అతడు ఆవస్తువు అవుసరం లేదనుకుంటే సమీప పోలీసు స్టేషనులో స్వయంగాగాని, గ్రామ రెవెన్యూ అధికారి ద్వారాగాని అప్పగించాలి. వెంటనే స్టేషన్ హౌస్ ఆఫీసరు వస్తువు ఎవరి వల్ల అప్పగించబడినది, వస్తువు వివరములు, విలువ తెలియజేస్తూ పరిధిగల జుడీషియల్ మెజిస్ట్రేటు వార్కి నివేదిక పంపుతారు. ఆ వస్తువుకు సంబంధించిన యజమాని క్లైమెంటు ఉన్నచో, విచారణ జరిపి, అతనిని యజమానిగా గుర్తిస్తే వస్తువును అతనికి అప్పగించాలి.

ఈ చట్టములోని సెక్షన్ 3 ప్రకారము క్లైముచేయని లేదా వారసులు లేనట్టి చనిపోయిన వ్యక్తి యొక్క స్థిరాస్తులు రాష్ట్రప్రభుత్వానికి చెందుతాయి. ఆ విధంగా దఖలుపడిన ఆస్తులు సాధారణంగా ప్రధాన భూ పరిపాలన కమీషనరు (కాంపిటెంటు ఆధారిటీ) ఆధీనంలో వుంటాయి. (సెక్షన్4)

సెక్షన్ 5(1) మరియు (2) అనుసరించి జి.ఒ.యమ్.ఎన్.నెం.1426 రెవిన్యూ తేది-31-10-1977ఉత్తర్వు ల ప్రకారం జిల్లా పరిధిలో జాయింటు కలెక్టరు "లోకల్ ఆఫీసరు" గాను మండల పరిధిలో తహశీల్దారు "సహాయ అధికారి" గాను వ్యవహరిస్తారు.

క్లైమ్ చేయని, వారసులులేని ఆస్తి హక్కు అధికారము లేని వ్యక్తి ఆధీనములో వుండి, అతడు లోకల్ ఆఫీసరు కోరిన వెంటనే ఆస్తిని అప్పగించుటకు నిరాకరిస్తే సెక్షన్ 8 ప్రకారం పరిధి కలిగిన సివిల్ కోర్టులో ఆస్తి స్వాధీనం చేయించవలసినదిగా కొరుచూ దావా వేయాలి. కోర్టు సదరు ఆస్తి బేవార్సు ఆస్తిగా గుర్తించి, స్వాధీనంపొందుటకు ఉత్తర్వుచేస్తే, లోకల్ ఆఫీసరు ఆ ఆస్తిని స్వాధీనపర్చుకోవాలి.

సహాయ అధికారి నివేదిక అందిన వెంటనే అట్టి ఆస్థి గురించి కాంపిటెంటు అధారిటీ అయిన ప్రధాన భూ పరిపాలన కమీషనరుకు ఫారం 1 లో "లోకల్ ఆఫీసరు" (జాయింటు కలెక్టరు) నివేదిక పంపాలి. వారసులు లేనట్టి, క్లైమ్‌చేయనట్టి ఆస్తి గురించి క్లైమెంట్సు ఎవరైనా ఉంటే 3 నెలలలోగా క్లైమ్ చేసుకోవలసినదిగా లోకల్ ఆఫీసరు ఫారం 2 లో నోటీసు జారీచేయాలి. (సెక్షన్ 7 మరియు 16) క్లైము దారు లేకుంటే "క్లైముచేయని/ వారసులు లేని బేవార్సు ఆస్తిగా ప్రకటించాలి.. క్లైమెంటు క్లైము ఫారం 3 లో దాఖలు చేస్తే

అట్టి క్లైమును పరిధి కలిగిన సివిల్ కోర్టుకు సెక్షన్ 11-(3)(ఎ) క్రింద రిఫర్ చెయ్యాలి. కోర్టు క్లైమెంటు వాదన, లోకల్ ఆఫీసరు వాదన విన్న పిదప, క్లైమెంటు తాను వారసుడు, హక్కు దారుడనని ఋజువు చేసుకుంటే, అట్టి ఆస్తిని క్లైమెంటుకు అప్పగించుటకు ఉత్తర్వులు జారీ చేయాలి. సెక్షన్ 11-(3) (బి) ప్రకారం, క్లైము ఋజువు కానిచో "క్లైము ఋజువుకాని, వారసులు లేని బేవార్సు ఆస్తిగా డిక్లేరు చేయాలి.

ఫారం-2 నోటీసు కలెక్టరు కార్యాలయంలోను తహశీల్దారు కార్యాలయంలోను, గ్రామ పంచాయితీలోను ప్రచురించి, గ్రామంలో దండోరా మూలముగా ప్రకటన చేయించాలి.

ఆ విధంగా సెక్షన్ 11-(2) లేదా 11-3 (బి) ప్రకారము డిక్లేరు చేసిన బేవార్సు ఆస్తి గురించి ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లోను స్థానిక దిన పత్రికలోను ప్రకటన (Notification) చేయించాలి. నోటిఫికేషను వివరములు గ్రామంలో కూడ సెక్షన్12 ప్రకారం ప్రకటింపజేయాలి.

బేవార్సు ఆస్తి స్థిరాస్తి అయినచో సెక్షన్ 13 ప్రకారము Notification ప్రకటించిన 12 సంవత్సరముల వరకు వేలం వేయరాదు/క్రయ పర్చరాదు.

ప్రభుత్వ ఆధీనములో ఉన్న బేవార్సు ఆస్థిని సెక్షన్ 6లో గల పరిమితులకు లోబడి లోకల్ ఆఫీసరు సెక్షన్ 10 ప్రకారం ఆస్తి విషయంలో 5 గురు పెద్ద మనుష్యులతో "పంచనామా" నిర్వహించి ఆస్తి వివరములు, విలువలతో కూడిన నివేదిక తయారుచేసి కాంపిటెంటు అధారిటీకి పంపాలి. స్థిరాస్తి విషయంలో ఆ ఆస్తిని శాశ్వితంగా పరిష్కరించే పర్యంతం కౌలు హక్కులు లీజుకు యివ్వాలి. బేవార్సు ఆస్తి స్థిరాస్తి కాకుండ నశించే స్వభావంగల (Perishable) ఆస్తి అయినచో అట్టి ఆస్తిని వెంటనే వేలంవేయించి, పాట ఖాయపరచి, సొమ్ము వసూలు చేసి డిపోజిట్టులో ఉంచాలి. ఇట్టి ఆస్తి విషయంలో వెంటనే కాంపిటెంటు ఆధారిటీకి నివేదికపంపాలి. ఆస్థి చరాస్తి అయినచో దాని విలువ రూ- 50/-లు మించనిచో అట్టి ఆస్తిని వేలంద్వారా విక్రయించి, సొమ్ము డిపోజిట్ చేయాలి.

సెక్షన్ 6 ప్రకారు క్లైము చేయని/వారసులు లేని (బేవార్సు) ఆస్తిని

1. విలువతో సంబంధం లేకుండ ప్రభుత్వమువారు

2. విలువ రూ. 10,000/-లు మించనిచో కాంపిటెంటు అధారిటీ.

3. విలువ రూ,2,000/-లు మించనిచో లోకల్ ఆఫీసరు (జిల్లా జాయింటు కలెక్టరు)

పై పరిమితులకు లోబడి పరిష్కరించవచ్చును.

# ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ భూములను వ్యవసాయేతర ప్రయోజనాలకు మార్పు చట్టం 2006

(The A.P. Agricultural Land (Conversion for Non Agricultural Purposes) Act 2006)

ఈ చట్టం తేది:2/01/2006 నుండి అమలులోకి వచ్చింది. ఈ చట్టం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి వర్తిస్తుంది.

వ్యవసాయ భూమిని, వ్యవసాయేతర భూమిగా మార్చిన / మార్పుచేసిన సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి అనుమతి తీసుకొనవలెను. మార్పు చేసుకొనుటకు ప్రభుత్వము నిర్ణయించిన బేసిక్ విలువలో 10 శాతం విలువ కన్వర్షన్ ఫీజుగా చెల్లించి సదరు రసీదును ధరఖాస్తుతో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారికి దాఖలు చేయాలి.

చెల్లించవలసిన రుసుము కంటె తక్కువ చెల్లించిన ఎడల ధరఖాస్తు చేరిన 30 (ముప్పది) రోజుల లోపల సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారి మిగిలిన రుసుమును చెల్లించమని ధరఖాస్తు దారునకు నోటీసు పంపవలయును. నోటీసు అందిన 15 (పదిహేను) రోజుల లోపల ధరఖాస్తు దారుడు మిగిలిన రుసుము చెల్లించవలయును.

ధరఖాస్తు దారునకు 30(ముప్పది) రోజుల లోపల ఎటువంటి నోటీసు రెవన్యూ డివిజనల్ అధికారి నుండి రానిచో చెల్లించిన కన్వర్షన్ ఫీజు (రుసుము) సరిపోయినట్లు భావించబడును.

ధరఖాస్తు చేరిన 60 (అరువది) రోజులలోపు రెవెన్యూ డివిజనల్ అధికారి గారు అనుమతి ఉత్తర్వులు యివ్వనిచో కన్వర్షన్ అప్లికేషన్ ఆమోదించినట్లే.

వ్యవసాయ భూమి, వ్యవసాయేతర భూమిగా రెవెన్యూ డివిజనల్ అధికారి అనుమతి లేకుండా మార్పు చేసినట్లయితే అట్టి భూమిని చట్ట ప్రకారం వ్యవసాయేతర భూమిగా పరిగణింపబడను. ఆమోదము లేకుండా మార్పు చేసిన వారిపై అపరాధ రుసుము క్రింద కన్వర్షన్ ఫీజుపై 50% పెనాల్టీ ఎందుకు విధించగూడదో 15 రోజుల లోపల తెలుపవలసినదిగా అటువంటి వ్యక్తి/ వ్యక్తులకు రెవెన్యూ డివిజనల్ అధికారి నోటీసు యివ్వవలెను.

ఆ విధముగా సమాధానము, నిర్ణయించిన 15 రోజుల గడువు లోపల రానిచో కన్వర్షన్ ఫీజు అనగా సదరు భూమి బేసిక్ వాల్యూలో 10 శాతం విలువ మరియు దానిపై 50 శాతం పెనాల్టీ చెల్లించవలసినదిగా రెవెన్యూ డివిజనల్ అధికారి ఉత్తర్వులు యిచ్చుదురు. ఉత్తర్వు లిచ్చిన 15 (పదిహేను) రోజులలోపల సదరు విధించిన ఫీజు మరియు పెనాల్టీ చెల్లించనిచో రెవెన్యూ బాకీవలే ఆ సొమ్మును వసూలు చేస్తారు.

రెవెన్యూ డివిజినల్ అధికారి ఉత్తర్వులిచ్చిన 60 (అరువది) రోజులలో జిల్లా కలెక్టర్ గారికి అప్పీలు కలదు.

**ఈ చట్టం ఈ క్రింది వాటికి వర్తించదు.**

1. ప్రభుత్వ భూములు
2. స్థానిక సంస్థలకు చెందిన భూములు (వ్యాపారమునకు వాడని భూములు)
3. మత, ధర్మాదాయ ప్రయోజనములకు ఉపయోగించు భూములు
4. ఎకరములోపు భూమిని కుటీర పరిశ్రమలకు ఉపయోగించిన

ఈ చట్టం క్రింద యిచ్చిన ఆదేశాలను సివిల్ కోర్టులలో ప్రశ్నించడానికి వీలులేదు.

# ఆంధ్రప్రదేశ్ నీటి పన్ను చట్టం 1988

**1.పరిచయము:**

ఆంధ్రప్రదేశ్ "ఆంధ్రా ఏరియా" లో 1395 ఫసలీ వరకు నీటి తీర్వా విధించుటలో గల వ్యత్యాసములు గమనించి, నీటి తీర్వా విధింపు క్రమబద్ధీకరించు నిమిత్తం నీటి పారుదల వనరులను రెండు ప్రధాన తరగతులుగా విభజించారు. మొదటి తరగతిగా మేజర్ మరియు మీడియం జలాధారముల (భారీ మధ్య తరహాజలాధారముల ద్వారా జరిగే నీటి పారుదల వనరులున్నూ, రెండవ తరగతిగా మైనరు (చిన్న తరహా) 4 మాసములపైబడి ప్రభుత్వ జాలాధారముల నుండి నీటి పారుదల జరిగే నీటివనరులుగా గుర్తించి వాటి క్రింద స్థిరీకరించిన ఆయకట్టు భూములపై నీటి పన్ను విధింపు క్రమబద్ధీకరించుటకుగాను ఆంధ్రప్రదేశ్ నీటి పన్ను చట్టం 1988 చేయబడింది. ఈ చట్టము తే. 1. 7. 1986దీ నుండి అమలులోనికి వచ్చినది.

**2.కలెక్టరు లేక సి.సి.యెల్.ఎ. జారీ చేయు నోటిఫికేషను:**

ఈ చట్టములోని సెక్షన్ 4 ప్రకారముపై తరహా నీటి వనరులను జిల్లా పరిధిలో జిల్లా కలెక్టరు వారు స్థిరీకరించిన ఆయకట్టు ఒకటి కంటే ఎక్కువ జిల్లాలో వ్యాపించి ఉన్నచో చీఫ్ కమీషనరు ల్యాండు ఎడ్మినిస్ట్రేషను వారు ఎప్పటికప్పుడు (ఆయకట్టు విస్తీర్ణములు వ్యత్యాసములకు లోనైనప్పుడల్లా) ఫారం 1 లేదా 2 లో నోటిఫై చేయాలి.

**3. తహశీల్దారు జారీ చేయునోటిఫికేషను, విచారణ, నీటిపన్ను నిర్ణయం:**

పై విధంగా నోటిఫై చేయబడిన నీటి వనరుల తరగతులనుబట్టి సెక్షన్ 5లోని అధికారమును పురస్కరించి, తహశీల్దారు ప్రతి గ్రామంలోను రైతులు చెల్లించవలసిన నీటి తీర్వా (సెక్షన్ 3) ప్రకారము నిర్ధారణచేసి, ఒక్కొక్క వనరు క్రింద గల భూముల వివరములు వారు చెల్లించవలసిన నీటి తీరువా వివరములతో నోటిఫికేషను ఫారం-3లో జారీచేస్తూ రూలు 4(1) ప్రకారము గ్రామచావిడి, (పంచాయితీ) నోటీసు బోర్డులో, తహశీల్దారు కార్యాలయము, నోటీసు బోర్డులలో ప్రచురించాలి. అట్లు ప్రచురించిన 30 రోజులలోగా ఆక్షేపణలున్న భూకామందు తన ఆక్షేపణలు తెలియజేయాలి. అట్టి ఆక్షేపణలు పరిశీలించి, తహశీల్దారు తగు ఉత్తర్వులు జారీచేయాలి. ఆక్షేపణలు రానిచో నిర్ణయించిన నీటి పన్ను ఖాయమౌతుంది.

**4.అప్పీలు:**

సెక్షన్ 6 ప్రకారము, తహశీల్దారు జారీ చేసిన ఉత్తర్వులపై గాని, నిర్ణయించి ఖాయపర్చిన నీటి తీర్వా నోటిఫికేషనుపైగాని 30 రోజులలోగా రెవెన్యూ డివిజినల్ అధికారి వద్ద అప్పీలు దాఖలు చేసుకోవచ్చు. అప్పీలులో రెవెన్యూ ఇవిజినల్ అధికారి తహశీల్దారు వారి ఉత్తర్వులను ఖాయపర్చవచ్చు, లేదా మార్చవచ్చు, లేదా రద్దు పర్చవచ్చు.

**5.భూమి శిస్తు బకాయిగా వసూలు:**

సెక్షన్ 7 మరియు 8 ప్రకారం నీటి తీర్వా విధించిన ఫసలీ అంతమయ్యేలోగా చెల్లించకపోతే, ల్యాండురెవెన్యూ బకాయిగా రెవెన్యూ రికవరీ చట్ట ప్రకారం వసూలు చేయవచ్చు.

**6.రివిజను:-**

సెక్షన్ 9 ప్రకారము జిల్లా కలెక్టరు వారు, దరఖాస్తు పైగాని, తనంతట తానుగాగాని తహశీల్దారు లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి ఉత్తర్వుల అమలు తేదీ నుండి 60 రోజులలోగా దిగువ ఆధికార్ల రికార్డులను నివేదికను పరిశీలించి, వారి ఉత్తర్వులపై తగు విధముగా రివిజన్ ఉత్తర్వులు జారీచేయవచ్చు.

**7.న్యాయస్థాన పరిధి మినహాయింపు:**

సెక్షన్ 11 ప్రకారం ఈ చట్ట పరిధిలో నిర్ణయించిన నీటి గురించి ఏ న్యాయస్థానము ప్రశ్నించుటకు అధికారము లేదు.

**8.నీటి పన్ను రేట్లు:**

ఈ చట్ట ప్రకారము నిర్ణయించిన నీటి పన్ను రేట్లు ఈ క్రింది విధంగా ఉంటాయి.

| క్రమ సంఖ్య | పంటవివరణ | ఎకరము ఒక్కింటికి నీటి తీర్వా | |
|---|---|---|---|
| | | మొదటి తరగతిజలాధారము | రెండవ తరగతి జలాధారము |
| | | రూ. | రూ. |
| 1. | మొదటి లేక ఒకే మాగాణీపంట | 200.00 | 100.00 |
| 2. | రెండవ, మూడవ మాగాణీ పంట | 150.00 | 100.00 |
| 3. | మొదటి పారుదల మెట్ట పంట | 100.00 | 60.00 |
| 4. | రెండవ, మూడవ పారుదల మెట్ట పంట | 100.00 | 60.00 |
| 5. | ఫసలీలో దొఫసల్-పంట (చెరకు, అరటి వ॥) | 350.00 | 350.00 |
| 6. | సంవత్సరంనకు చేపల చెరువులకు | 500.00 | 500.00 |

9. మెరక భూమిగా పరిగణన నీటి తీర్వా విధించవలసిన మాగాణీ (నంజ/పల్ల (తరి)) మరియు మెరక (పుంజ/మెట్ట(ఖుష్కి)) భూములను మెరక భూములుగానే పరిగణించాలి.

**గమనిక:**

| క్రమ.సంఖ్య | రద్దుకాబడిన/ వసూలు చేయరాని అయిటములు | ప్రభుత్వ ఉత్తర్వులు తేదీ |
|---|---|---|
| 1. | గతంలో విధించే సెస్సులు వసూలుచేయనవసరం లేదని వివరించపబడినది | Govt.Memo.No.956/LR3/97-3 Revenue Dt.29-01-1997. |

| క్రమ.సంఖ్య | రద్దుకాబడిన/ వసూలు చేయరాని అయిటములు | ప్రభుత్వ ఉత్తర్వులు తేదీ |
|---|---|---|
| 2. | ల్యాండు సెస్సు (లోకల్ సెస్సు, విద్యా సెస్సు) వసూలు చేయన వసరం లేదని వివరింపబడినది. | G.O.Ms.No.267/Rev Dt.18-04-98. |
| 3. | ల్యాండు సెస్సు (లోకల్ సెస్సు, విద్యా సెస్సు) రద్దు చేసినారు. | G.O.Ms.No.559/Rev Dt.31-07-98. |
| 4. | డ్రైనేజి సెస్సు, మైంటెనెన్సు ఫీజు రద్దు చేసారు. | G.O.Ms.No.267/Rev Dt.18.04.98 |
| 5. | వాణిజ్య పంటలపై ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యేక సెస్సు విధింపు లేదు. | |
| 6. | బాకీ దారుల జాబితాను నీటి వినియోగ దారుల సంఘము వార్కి తెలియజేయాలి. | G.O.Ms.No.175/Rev. Dt.10.03.98 |
| 7. | గ్రామ పంచాయితీకి జమ చేయవలసిన నీటి తీర్వా (వసూలైన మొత్తంలో) 10% | G.O.Ms.No.347/Rev. Dt.21.04.99 |

భూమి శిస్తు, సెస్సులు, డ్రైనేజి సెస్సు, మైన్‌టెనెన్సు ఫీజు రద్దుకాబడినందున, ప్రభుత్వ జలవనరుల నుండి పారుదల నీటి సౌకర్యం పొందే భూములపై నీటి పన్ను మాత్రమే విధించి, వసూలు చేయవలసివున్నది.

ప్రభుత్వ జలవనరుల నుండి ఆక్రమణదారు దిగువ ఆయకట్టు దార్లకు అసౌకర్యం నీటి సరఫరాకు అంతరాయం కలుగజేయ కుండా, నీటి వనరులను పాడు చేయకుండా, నీటి ప్రవాహములకు అడ్డు కట్ట వేయకుండ, నీటి పారుదల పొందినచో నీటి పన్ను చట్ట ప్రకారము విధించవచ్చును.

10. వసూలైన నీటి తీరువా కేటాయింపు:

వసూలైన నీటి తీరువా ఈ క్రింది విధముగా విభజింపబడి నీటి పారుదల శాఖకు నీటి పారుదల యాజమాన్య సంస్థలకు కేటాయిస్తూ, వారి వారి పద్దులకు తహశీల్దారు జమచేయాలి.

| క్రమ సంఖ్య | జలాధారము తరగతి | రేటు రూ. | నీటి వినియోగ దారుల సంఘములు రూ. | డిస్ట్రిబ్యూటరీ కమిటీలు రూ. | ప్రాజెక్టు కమిటీలు రూ. | గ్రామ పంచాయితీలు రూ. | నీటి పారుదల శాఖ రూ. |
|---|---|---|---|---|---|---|---|
| 1. | మేజరు ఇరిగేషన్ సోర్సులు | 200 | 50 | 20 | 20 | 10 | 100 |
| 2. | మీడియం ఇరిగేషన్ సోర్సులు | 200 | 60 | - | 30 | 10 | 100 |
| 3. | మైనరు ఇరిగేషన్ సోర్సులు | 100 | 90 | - | - | 10 | - |

# ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి మరియు చెట్ల చట్టము - 2002

ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి మరియు చెట్ల చట్టము 19-4-2002 నుండి రాష్ట్రము నందు అమలు చేయడమైనది.

**ఈ చట్టము యొక్క ముఖ్యోద్దేశ్యములు :**

- భూగర్భ జలాన్ని పెంపొందించుట, నీటిని సంరక్షించుట మరియు భూగర్భ, భూ ఉపరితల జల దుర్వినియోగాన్ని క్రమ బద్ధీకరించుట.
- భూమిని పరిరక్షించుట.
- చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించుట.
- వాతావరణ కాలుష్యాన్ని, కలుషిత నీటి సరఫరాను అరికట్టుటకై సంబంధిత వాటి సంరక్షణ చర్యలు గైకొనుట.
- ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించుట.

ఈ చట్టము 3 ప్రకారం రాష్ట్ర, రూల్సు 8,9 మరియు 10 మేరకు జిల్లా, డివిజనల్ మరియు మండల అథారిటీలు (అధికార వర్గాలు)గా ఏర్పాటు గావించబడినవి. సభ్యులతో కూడిన పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి మరియు గ్రామీణ నీటి పారుదల మంత్రి వర్యులు రాష్ట్ర స్థాయి అథారిటీ గాను, జిల్లా కలెక్టరు వారిని జిల్లా స్థాయి అథారిటీ గాను, రెవెన్యూ డివిజనల్ అధికారి / సబ్ కలెక్టరు వారిని డివిజనల్ స్థాయి అథారిటీ గాను మరియు మండల స్థాయి అథారిటీగా తహశీల్దారు పదవీ రీత్యా ఛైర్మన్లుగా అధికారములతో వ్యవహరింపబడును.

పట్టణ పురపాలక సంస్థలందు మునిసిపల్ కమీషనర్లు మరియు తహశీల్దార్లు తమ తమ పరిధులందు అధికార వర్గాలుగాను మరియు నియుక్త (డిసిగ్నేటెడ్) అధికారులుగాను వ్యవహరింతురు.

## నీరు

**చట్టం - 8 (రూలు -12) - బావుల నమోదు :**

ప్రతి బావి (అనగా భూగర్భ జలాన్ని ఉపరితలానికి తీయుటకై త్రవ్వబడిన బావి, బోరు బావి, త్రవ్వకపు బావి, (డగ్ -కమ్ -వెల్), గొట్టపు బావి మరియు ఫిల్టర్ పాయింట్ యజమాని విధిగా ఫారం-1 (1వ నమూనా)లో వివరములను తెలియజేయవలయును. నమోదుకాని బావిపై చట్ట రీత్యా చర్య గైకొనబడును.

**చట్టం 9 :** **కొన్ని ప్రాంతములందు నీటిని నిలిపి తోడుట నిషేధించబడినది.**

**చట్టం 10:** **(రూలు - 13, 14) బావులకు ఆమోదము లేదా అనుమతి:**

ఎవరైనా ఒక వ్యక్తిగాని, సంస్థ గానీ తమ స్థలములందు క్రొత్తగా ఏవిధమైన బావిని / బోరు త్రవ్వ వలయునన్న (అనగా బోరు బావి, బోరింగు లేకా క్రొత్తగా త్రవ్వబడు బావి లేదా ఉన్న బావిని లోతు చేయుట) క్రింది విషయములను పాటించవలయును.

నమూనా-2 : వ్యవసాయ మరియు త్రాగు నీటి బావిని త్రవ్వుకొనుటకు అర్జీ
నమూనా-3 : వ్యవసాయ / త్రాగు నీటి బావిని త్రవ్వుకొనుటకు సంబంధిత అథారిటీచే అనుమతి పత్రం
నమూనా-4 : తిరస్కారపు ఉత్తర్వులు
నమూనా-5 : పరిశ్రమ / ఇతర ప్రయోజన నిమిత్తం క్రొత్త బావిని త్రవ్వుకొనుటకై అర్జీ
నమూనా-6 : పరిశ్రమ / ఇతర ప్రయోజన నిమిత్తం క్రొత్త బావికి అనుమతి పత్రం
నమూనా-6ఎ :పరిశ్రమ / ఇతర ప్రయోజన నిమిత్తం క్రొత్త బావికి తిరస్కారపు ఉత్తర్వులు
దరఖాస్తు ఫీజు (రుసుం) : రూ. 100.00 అనుమతి కొరకు

ఏదేని వనరుకు విద్యుచ్ఛక్తి మోటార్‌ను అమర్చదలచిన ఎ.పి. ట్రాన్స్‌కో వారి పూర్వానుమతి పొందవలెను.

త్రాగు నీటి వనరు ప్రాంతములో, ఆ వనరు చేతి పంపు లేక మామూలు బావి అయినచో దాని నుండి 200 మీటర్లు లేదా మోటారు కలిగియున్నచో 250 మీటర్లు దూరము లోపల ఎట్టి బావిని త్రవ్వరాదు. సందర్భానుసారంగా భూగర్భజల శాఖ వారి నిబంధనలు వర్తించును. చట్టంలోని ఏ నిబంధన నుల్లంఘించినను బావిని మూసివేయవచ్చును. నీటి పరిరక్షణ, నియంత్రణ కవసరమైన చర్యలు చేపట్టవచ్చును.

పూర్తి చేసిన దరఖాస్తును సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారి నుండి 2 దినములలో మండల అథారిటీ (తహశీల్దారు) కు చేరవలెను. డిసిగ్నేటెడ్ అధికారి సిఫారస్సులపై దరఖాస్తు పరిష్కరింపబడును. ఇందులకు 15 దినములు. కానీ, అట్టి అనుమతి ఎల్లప్పుడూ, విహిత పరచబడునట్టి షరతులకు లోబడియుండును. ఏక గవాక్ష (సింగిల్ విండో) పద్ధతిలో అర్జీలు పరిష్కరిపవలయును.

రుసుములను (ఫీజులు) డి.డి. రూపేన సంబంధిత అధికారి వర్గపు ప్రధాన కార్యస్థానంలో చెల్లించే విధంగా ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి, చెట్లు అధికార వర్గం నిధి (ఎ.పి. వాల్టా అథారిటీ ఫండ్) వుండాలి.

**చట్టం - 11:** నీటిని అత్యధికంగా వినియోగించుకున్న ప్రాంతాలుగా ప్రకటింపబడినచోట బావిని త్రవ్వరాదు.

**రూలు - 15: త్రాగు నీటికై బావిని స్వాధీనం చేసుకోవడం**

స్థానిక ప్రజలకు త్రాగు నీరు సరఫరాకు అవసరమైనట్టి బావులను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకోవటానికి అధికార వర్గం (అథారిటీ), సాధారణ లేదా ప్రత్యేక ఉత్తర్వు క్రింద నియుక్తుడై అధికారి (డిసిగ్నేటెడ్

ఆఫీసర్)కి అధికారం కల్పించారు. నియుక్తుడైన అధికారి సదరు బావులను గుర్తించిన మీదట అభ్యర్థన కాలాన్ని 6 నెలలకు ఎక్కువ గాకుండా నిర్దిష్ట పరుస్తూ బావి యజమానికి అభ్యర్థన ఉత్తర్వులివ్వాలి. సమీక్షానంతరం తగిన కారణాలతో అభ్యర్థన కాలాన్ని 6 నెలలకు ఎక్కువగాకుండా పొడిగించవచ్చును.

యజమాని సదరు బావిపై మాత్రమే వ్యవసాయము వలన జీవించుచున్న యెడల, జీవనోపాధి కోల్పోయినందులకు నష్టపరిహారమును సదరు బావి నుండి తీసుకొన్న నీటిలో గడచిన 3 సం.లలో అదే సమయంలో యజమాని పండించిన పంటల ఆధారంగా వ్యవసాయ శాఖతో సంప్రదించి జిల్లా కలెక్టరు వారు నిర్ణయించిన మీదట చెల్లింపు జరుగును. అభ్యర్థన అందిన మీదట, బావి యజమాని తన స్వంత త్రాగు నీటి వినయోగానికి తప్ప మిగతా ఏ విధమైన కార్యాలకు సదరు నీటిని వాడరాదు.

**చట్టం – 12 ప్రజాహిత త్రాగునీటి వనరుల రక్షణ :**

సాంకేతిక అధికారి సలహాపై బావిని తాత్కాలికముగా లేక శాశ్వతముగా గాని మూసివేయవలసినదని లేదా సీలు వేయవలసినదని ఉత్తర్వు ద్వారా అథారిటీ కోరవచ్చును.

**చట్టం – 13 : బావుల లోతు, దూరము : – నిబంధనలు, షరతులు వర్తించును.**

**చటం – 14 : (రూలు – 17) రంధ్రము వేయురిగ్గుల రిజిస్ట్రేషను :**

ప్రతి రిగ్గు యజమాని తమ మిషనరీని నిర్ణయించిన రుసుము (రూ.1000/–)ను చెల్లించి ఖచ్చితంగా రిజిష్టరు చేయించుకొనవలెను. ప్రతి రిగ్గు యజమాని లేదా కార్యకలాపాలు నిర్వర్తించే వ్యక్తి కాలానుగుణ సూచనలు ఖచ్చితంగా పాటించవలెను. ప్రతి రిగ్గును రెండు సంవత్సరముల కొకమారు నవీకరించుకొనవలెను. రిజిష్టరు అయిన పత్రం (ఫారం –16)ను ఎల్లవేలలా రిగ్గు పై ప్రదర్శింపవలెను. చట్టం నుల్లంఘించిన వారు శిక్షర్హులు.

**ఫారం (నమోనా) – 15 : రిగ్గు నమోదుకు దరఖాస్తు**

**ఫారం – 16 : అధికారి నమోదు పత్రం**

**ఫారం – 15 : బావులు మూసివేయుట :**

చట్టము అతిక్రమించి బావిని త్రవ్విని, త్రవ్వుచుండిన లేదా నీటిని వెలికితీసిన లేదా తీయబడుచుండినట్టి వాటిని మూయించవచ్చును. నష్ట పరిహారము చెల్లించవచ్చును.

**చట్టం 16 :** మూసివేయబడిన బావులకు చట్టము ననుసరించి నష్టపరిహారము చెల్లించవచ్చును.

**చట్టం 17 : (రూలు 16) వర్షపు నీరు నిల్వ చేయు నిర్మాణము :**

ప్రస్తుతము నివాస, వాణిజ్య మరియు ఇతర భవన ఆవరణము మరియు ఖాళీ ప్రదేశములందు సదరు నిర్మాణములు చేపట్టబడును. వీటిని పట్టణ, స్థానిక సంస్థలు అనుసరించవలసి ఉంటుంది.

**చట్టం 18 : నీటిని తిరిగి ఉపయోగించుట :**

వినియోగింపబడిన నీటిని రీసైక్లింగ్ చేయుట కొరకు మరియు తిరగి వినియోగించుటకు మార్గదర్శక సూత్రాలను రూపొందించవచ్చును. సాంకేతిక అధికారి సూచనలను పాటించవలెను.

**చట్టము 19 : (రూలు 18) నీటి కలుషితము పై నిషేధము :**

వ్యర్థ పదార్థాలు గల కలుషిత నీటిని నియంత్రించుట, క్రమబద్దీకరించుట మరియు నిషేధించుట చేయవచ్చును.

## భూమి

**చట్టం 20 : (రూలు 21) భూమి వినయోగ మార్పు మరియు నీటి నాణ్యత :**

అథారిటీ లేదా ఎవరేని నియుక్తుడైన అధికారి గాని ఏ భూమి నుండైన వచ్చు నీరు నాణ్యత, సందర్భాను సారంగా నిర్ణయించిన నాణ్యతా ప్రమాణాలతో పోల్చినపుడు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అంగీకరింపబడనిచో వినయోగపు భూమి యొక్క మార్పులను చేయవలసినదిగా భూ ఆక్రమ దారును ఆదేశింపవచ్చును.

**(రూలు 19) భూమి వినయోగం మరియు నీటి నాణ్యత :**

నీరు, భూసార నాణ్యత కాపాడుటకు ఆ ప్రాంతములలోని పరిశ్రమల కార్యకలాపాలను నిషేధించుటకు, నిబద్ధీకరించుటకు అథారిటీ (అధికార వర్గం)కు వీలున్నది.

**(రూలు 20) నీటి సెస్సు :**

ఏదైనా పరిశ్రమ 1977 నీటి నిరోధము మరియు కాలుష్య అదుపు చేయు సెస్సు చట్టంలోని 1 వ అనుసూచి క్రిందకు రానట్టి నీటిని వినియోగంపైన, విడుదల చేసే వ్యర్థ పదార్థాలపైన అధికారి వర్గం సెస్సును విధించవచ్చును.

**చట్టం - 21 : జల ప్రాంతములలో (వాటర్‌షెడ్స్) నీటి వినియోగం :**

జల ప్రాంత సంఘ సభ్యులు నియుక్తుడైన అధికారి (డిసిగ్నేటెడ్ ఆఫీసర్) చే శిక్షణ పొంది సమర్థవంతమైన నీటి వినియోగమును సాధించునట్లుగా చూడవలెను. సదరు సభ్యులు ఇతర రైతులకు శిక్షణ యివ్వవలయును.

**చట్టం 22 - ఉపరితల మరియు భూగర్భ జల గరిష్ఠ వినియోగం**

సాగు నీటి పారుదల ప్రాంతాలలో నీటి వినియోగ సంఘములు సదరు నీటి నియుక్త అధికారి సూచనల మేరకు వినయోగించే విధంగా చూడవలెను.

**చట్టం 23 – సరస్సులు, మడుగులు మరయు చెరువులు (వాటర్ బడీస్) సంరక్షణ :**

- నీటి వనరులు అనగా సరస్సులు, గ్రామ మడుగులు, కాలువలతో కూడిన చిన్న తరహా వ్యవసాయ చెరువులు, వారసత్వపు వనరులు గాను, రక్షిత ప్రాంతాలుగాను అధిసూచించవచ్చును. వీటిని ఉద్దేశించబడిన వినయోగముల నుండి మార్పు చెందకుండా నివారించుట.
- జల వనరులుగా గుర్తింపబడిన ప్రాంతాల నందలి దురాక్రమణలను నివారించుట మరియు తొలగించుట.
- అవాంఛనీయ ఘన, ద్రవ్య వ్యర్థ పదార్ధముల వేయుట నిషేధము.
- జల వనరులలోనికి అనుమతించదగిన కాలుష్యాల స్థాయి నిర్ణయించుట.
- కలుషిత నీటి ప్రవేశమును నివారించుట, అదుపు చేయుట.

**చట్టం 24 (రూలు 22) నీటి వినయోగంపై గరిష్ఠ పరిమితి :**

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నివారణ సంస్థ నిర్ధారించిన గరిష్ట పరిమితికి మించి మంచి నీటి వినియోగంను ఉత్పాదక యూనిట్ (పరిశ్రమలు) వాడినచో అనగా చట్టంను అతిక్రమించినచో గరిష్ఠ రుసుమును విధించవచ్చును.

**చట్టం 25 – వినియోగింపబడుటకు అధికారము :**

వాటర్ బాడీస్ సక్రమ సంరక్షణ మరియు పరిరక్షణ నిమిత్తం ఒక అధికారికి జల వనరుల ఇంఛార్జిగా వినియోగించబడుటకు అధికారము కలిగియుండును.

**చట్టం – 26 – గండ్ల నుండి రక్షణ :**

సాగు నీటి పారుదల వనరులకు గండ్లు పడకుండా నిరోధించుట మరియు గండ్లు పూడ్చుటకు నిర్దిష్ఠ కాల వ్యవధిని నిర్ణయించి నీటి వాడకం దార్ల సంఘములకు (డబ్ల్యు.యు.ఏ.లు) ఆదేశాలిచ్చుట. సదరు చర్యలు సంబంధిత అధికారి ద్వారా చేపట్టబడును.

**చట్టము 27 (రూలు 23) ఇసుక త్రవ్వకము :**

ఇసుక త్రవ్వకము వలన భూగర్భ జల ప్రక్రియకు అవరోధం కలుగుతున్నవని ప్రకటించిన ప్రాంతములందు ఇసుక త్రవ్వకము, రవాణాను నిషేధింపబడినది.

సాగు నీరు లేదా త్రాగు నీరు సంబంధించి ఏదైనా భూగర్భ జలాలను బయటకు తీసే నిర్మాణములకు 500 మీటర్ల లోపల, ప్రవాహాలలో ఇసుక మేట మందం 2 మీ కంటే తుక్కువ వున్న చోట ఇసుక త్రవ్వరాదు.

# చెట్లు

**చట్టం 28 (రూలు-24) చెట్లు నాటుట :**

ప్రతి మునిసిపల్ కార్పోరేషను లేదా మునిసిపాలిటీ (పురపాలక సంస్థ) లోను లేదా ఇతర స్థానిక ప్రాంతాలలోను నాటవలసిన చెట్లు, నిర్వహణ క్రింది విధంగా వుండాలి.

1) నివాస ప్రాంతములలో

| | |
|---|---|
| 100 చ.మీ కంటే తక్కువ విస్తీర్ణములో | 3 చెట్లు |
| 101 నుండి 200 చ.మీ విస్తీర్ణములో | 5 చెట్లు |
| 201 నుండి 300 చ.మీ విస్తీర్ణములో | 10 చెట్లు |
| 301 చ.మీ పై బడిన విస్తీర్ణములో | 10 చెట్లు ప్రతి 100 చ.మీ పెరుగుదల విస్తీర్ణమునకు 5 చెట్ల చొప్పున |

2) వాణిజ్య లేదా సంస్థాగత ప్రాంతాలలో

| | |
|---|---|
| 200 చ.మీ కంటే తక్కువ విస్తీర్ణములో | 2 చెట్ల |
| 201 నుండి 500 చ.మీ విస్తీర్ణములో | 4 చెట్లు |
| 501 నుండి 1000 చ.మీ విస్తీర్ణములో | 6 చెట్లు |
| 1001 చ.మీ పై బడిన విస్తీర్ణములో | 6 చెట్లు, ప్రతి 100 చ.మీ పెరుగదల విస్తీర్ణమునకు 2 చెట్ల చొప్పున |

వాణిజ్య లేదా సంస్థాగత ప్రాంతములలో ఏవేని చెట్లను ఉంచకుండా వదలివేయుటకు బదులుగాపచ్చికతో అందంగా తీర్చిదిద్దాలి.

3) పారిశ్రామిక ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రమాణాల మేరకు చెట్లను నాటాలి.

ప్రాంగణంలో లేదా గృహ యజమాని చెట్లను నిర్వహించాలి. నియుక్త అధికారి పూర్వానుమతి లేకుండా చెట్లను పడగొట్టరాదు.

ఎవరేని యజమాని చెట్లను పడగొట్టవలెనన్న (నమూనా) ఫారం - 13 నందు వివరములు వ్రాసి దిగువ తెలిపిన రుసుంతో నియుక్తుడైన అధికారికి అనుమతి కోసం దరఖాస్తు చేయలి.

- పట్టణ నైవాసిక మరియు సంస్థాగత ప్రాంతములకు రూ.50.00 లు
- పట్టణ వాణిజ్య ప్రాంతాలకు రూ. 100.00 లు

నియుక్త అధికారి లేదా తనచే అధికారమును పొందిన అధికారి సదరు దరఖాస్తు (ఫారం-13)పై తనిఖీ మరియు విచారణ జరిపి అనుమతి లేదా నిరాకరణ ఫారం - 14 నందు యివ్వబడును.

- అనుమతి లేనిదే పడిపోయిన / పడగొట్టబడిన చెట్లు సామాగ్రిని రవాణా చేయరాదు.
- నియుక్త అధికారి దరఖాస్తు అందిన 15 రోజులలోపల పరిష్కరించవలెను.
- చెట్టును పడగొట్టవలెనన్న 30 దినములలోపల రెండు చెట్లను అదే స్థలములో గాని లేదా అనువైన ప్రాంతములో గాని నాటవలెను.
- నియుక్త అధికారి నిర్ణయము మేరకు పైన పేర్కొన్న ప్రమాణముల సూచించిన విధంగా ఏదేని ప్రాంగణములో గాని లేదా ఖాళీ స్థలములోగాని తక్కువ చెట్లున్నవని భావించిన మరియు ప్రకృతి వైపరీత్యాల వల్ల పడిపోయిన లేదా నాశనమైనను సదరు హక్కు దారులకు విన్నవించుకొనే సహేతుకమైన అవకాశాన్నిచ్చిన తరువాత ఆయన ఉత్తర్వు ద్వారా నిర్దిష్టపరచిన చెట్లను లేదా అదనపు చెట్లను నాట వలసినదిగా కోరవచ్చును.
- 90 రోజులలో యజమాని సదరు ఉత్తర్వు మేరకు నాటవలెను.
- సంస్థల ప్రాంగణంలో లభ్యంగా వున్న 30 శాతం బహిరంగ ప్రాంతంలో ప్రతి 100 చ.మీలకు 6 కంటే తక్కువ కాకుండా చెట్ల సాంద్రతతో చెట్ల పెంపకాన్ని చేపట్టాలి.

**చట్టం 29 - చెట్లకు రక్షణ :**

ప్రజోపయోగ సర్వీసు నిమిత్తం ఎవరేని పబ్లిక్ లేదా ప్రైవేటు వ్యక్తి వారి మౌళిక సదుపాయములను అభివృద్ధి పరచు లేదా వారి కార్యకలాపాలను నెరవేర్చునప్పుడు చెట్లు మరియు వాటి కొమ్మలకు రక్షణ కల్పించాలి.

**చట్టం 30 - ప్రభుత్వ శాఖలు మొదలగునవి చెట్లను నాటుట :**

రహదారుల ఒడ్డు వెంబడి, కాలువ గట్లు, చెరువు ముందు తీరము మరియు నీటి వనరులందు చెట్లు నాటుటకు అథారిటీ మార్గదర్శక సూత్రములను రూపొందించవచ్చును.

**చట్టం - 31 - గొర్రెలు మరియు మేకల పెంపకము :**

గొర్రెలు / మేకలును కొట్టములో పెట్టి పెంచుట ప్రోత్సహించుచూ దశల వారీగా మేకల కాపర్లకు

ఆశ్రమము కల్పించుట ద్వారా చెట్లకు రక్షణ ఏర్పడును.

**చట్టం 32 – అంచు ప్రాంతాలలో చెట్లను రక్షించుట :**

చెట్లను రక్షించుటకు గాను సంప్రదాయేతర ఇంధన వనరులనుపయోగించుటకు అటవి అంచు ప్రాంతాలలో నివసించు వారిని ప్రోత్సహించవలెను.

**రూలు 25 – నేర వ్యాజ్యములు చేయుట : పారం – 7, ల మరియు 9**

**చట్టం 33 – (రూలు 29) అప్పీళ్ళు :**

నియుక్త అధికారి చేసిన ఏదేని ఉత్తర్వు ద్వారా నష్టపోయిన ఏవరేని వ్యక్తి తనకు ఉత్తర్వు అందిన తేదీ నుండి 30 దినములలోపల అప్పీలు చేయవచ్చును. రాష్ట్ర అధికార వర్గపు నిర్ణయం అంతిమం.

**(రూలు 30) సమీక్షలు :**

ప్రభుత్వం సమీక్ష కోసం దరఖాస్తును సంబంధిత శాఖ సందర్భానుసారంగా సంబంధిత కార్యదర్శికి సమర్పించాలి. నష్టపోయిన వారికి చెప్పుకోవడానికి సబబైన అవకాశాన్నిచ్చిన పిదప ఆ శాఖ 30 రోజులలో దరఖాస్తు పరిష్కరించాలి.

**చట్టం 34 – సద్భావముతో తీసుకొన్న చర్యకు రక్షణ :**

సదరు చర్యలపై ఉత్తర్వులు చేసినట్టి వారిపై శాసన బద్ధ చర్య ఉండదు.

**చట్టం 35 (రూలు – 26) శిస్తులు (పెనాల్టీలు) :**

చట్టము నతిక్రమించిన యెడల రూ. 1000/–లకు తగ్గకుండా రూ. 5000/– లకు మించకుండా జరిమానాను విధించవచ్చును. కొన్ని సందర్భాలలో రూ. 50,000 ల వరకు పెనాల్టీ విధిస్తూ మరియు 6 నెలల కారాగార శిక్షణను గూడా చట్టము ననుసరించి విధించవచ్చును.

పూర్వానుమతి లేకుండా చెట్టు పడగొట్టబడిన యెడల సదరు చెట్టు విలువకు రెండింతలు తక్కువగాకుండా ఐదింతలకు జరిమానాతో శిక్ష సందర్భానుసారంగా విధించవచ్చును.

**చట్టం 36 : నోటీసులు, ఉత్తర్వులు జారీ చేయుట**

**చట్టం 37 (రూలు 27) : కాంపొండింగ్ నేరము :**

కాంపౌఇండింగ్ నేరము క్రింద చట్టములోని 35 (2) మేరకు నేరము కాకున్నను, చట్టములోని 10,14 మరియు 27 ఉల్లంఘించిననూ ఒక్క లక్ష రూపాలకు తక్కువగాకుండా కాంపొండింగ్ నేరము క్రింద జరిమానాను విధించవచ్చును.

**ఫారం – 10 : కాంపొడింగ్ ఉత్తర్వు : ఫారం –11 :కాంపొండింగ్ ఫీజుకు రశీదు.**

**చట్టం 38 : (రూలు 27) : కాంపౌండింగ్ నేరము :**

**చట్టం 39 :** చట్టంలోని నిబంధనలు, తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో యిందుకు ప్రతి కూలముగా యేమున్నప్పటికిని అమలు కలిగి ఉండవలెను.

**చట్టము 40 : మినహాయింపులు**

ప్రభుత్వము అధిసూచించిన మేరకు మినహాయింపులు వర్తించును

**చట్టం 41, 42 మరియు 43 (రూలు 31):** ఆంధ్రప్రదేశ్ వాటర్, ల్యాండ్ మరియు ట్రీస్ అథారిటీ ఫండ్

"ఆంధ్రప్రదేశ్ నీరు, భూమి మరియు చెట్ల ప్రాధికారి సంస్థ నిధి " క్రింద ప్రాధికారి సంస్థచే స్వీకరింపబడు అన్ని పైకములు క్రింది వాటితో సహా నగదు లేదా డి.డి.లను మెంబరు కార్యదర్శి మరియు ఛైర్మను సంయుక్తంగా వ్యవహరింపబడు యా నిధి క్రింద జమ చేయవలెను.

సెస్సులు, సర్ ఛార్జీలు, అన్ని శిస్తులు (పెనాల్టీలు), గ్రాంట్లు, నమూనా (ఫారం – 12)లో అకౌంట్లు వ్రాయవలెను.

**రూలు – 32 :** నిజమైన మరియు పూర్తి మొత్తమును ప్రభుత్వ నిర్థిష్ఠ నమూనా యందు సాంవత్సరిక నివేదికను పంపవలయును.

చట్టం 44 : సందేహాలు మరియు చిక్కులు తొలగించుటకు అధికారమున్నది.

చట్టం 45 : నిబంధనలు చేయుట కధికారము.

చట్టం 46 : ఆంధ్రప్రదేశ్, నీరు, భూమి మరియు చెట్ల శాసన పూర్వకమైన (అధ్యాదేశము) ఆదేశము ( ఎ.పి. వాల్టా ఆర్డినెన్స్), 2000 రద్దు చేయబడినది.

**చట్టం – 47 :** ఆంధ్రప్రదేశ్, భూగర్భ జల (త్రాగు నీటి వనరుల నియమములు) చట్టం 1996 రద్దు చేయడమైనది.

ఇందులోని నియ, నిబంధనలు సందర్భానుసారంగా తత్సమయములందు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆదేశముల మేరకు మార్పులు, చేర్పులు కలుగుచుండును.